ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 18.05.2025 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. హైదరాబాద్ లోని గుల్జార్ హౌస్ వద్ద జరిగిన అగ్ని ప్రమాదంలో 17 మంది మరణించారు. గాయపడినవారిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు చెప్పారు.
2. మృతుల కుటుంబాలకు 2 లక్షలు, గాయపడ్డవారికి 50 వేల రూపాయల సహాయాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు.
3. ఒకే దేశం-ఒకే ఎన్నికలపై కార్యాచరణకు సమయం ఆసన్నమైందని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు.
4. గిరిజన రైతుల పోడు భూములను సస్యశ్యామలం చేసేందుకు ఉద్దేశించిన ఇందిరా సౌర జల వికాసం పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రేపు నాగర్ కర్నూల్ జిల్లాలో ప్రారంభిస్తారు.

-----------------------

**గుల్జార్ హౌస్ ప్రమాదం**

హైదరాబాద్ లోని ఛార్మినార్ సమీపంలో గుల్జార్ హౌస్ వద్ద రెండతస్తుల భవనంలో జరిగిన అగ్ని ప్రమాదంలో 17 మంది మరణించారు. పలువురు గాయపడ్డారు.

మరణించిన వారిలో 7 గురు పిల్లలు, ఐదుగురు మహిళలు ఉన్నారు. గాయపడిన వారిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు స్థానిక పోలీసు అధికారులు తెలియజేశారు. గాయపడినవారిని DRDO ఆసుపత్రితో పాటూ, ఉస్మానియా ప్రభుత్వ ఆసుపత్రి, ఇంకా ప్రైవేటు ఆసుపత్రుల్లో చేర్చి చికిత్స ఇస్తున్నట్లు వెల్లడించారు. ప్రమాద సమాచారం అందుతూనే, 12 ఫైర్ ఇంజన్లు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. సహాయ సిబ్బంది 17 మందిని మంటల్నుంచీ రక్షించినట్లు స్థానికులు తెలియజేశారు. కింది అంతస్తులో దుకాణాలు, పై అంతస్తుల్లో నివాసాలు ఉండటంతో, గ్రౌండ్ లేవల్లో ఏర్పాడ మంటలు పై అంతస్తులకు వ్యాపించినట్లు భావిస్తున్నారు. ఇలా ఉండగా, ప్రమాద ఘటనపై దిగ్భ్రాంతిని వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి రెవంత్ రెడ్డి గాయపడ్డవారికి మెరుగైన చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు. కాగా ప్రమాద కారణాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

**MSL**

----------------------------

**అగ్ని ప్రమాదం – కిషస్ రెడ్డి**

ప్రమాదం చిన్నదైన నష్టం ఎక్కువ జరిగిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. అగ్ని ప్రమాదాలపై సమర్థవంతంగా స్పందించడానికి వీలుగా అగ్ని మాపక సిబ్బందికి సరైన శిక్షణ, పరికరాలు అందించాలని కిషన్ రెడ్డి అన్నారు.

**----------- బైట్ కిషన్ రెడ్డి ప్రభాకర్ ------------**

**DESK**

-------------------------

**అగ్ని ప్రమాదం – పొన్నం**

గుల్జార్ హౌస్ వద్ద అగ్ని ప్రమాదం జరిగిన ప్రదేశంలో హైదరాబాద్ ఇంఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ సహాయ చర్యలను పర్యవేక్షిస్తున్నారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన తెలిపారు. ప్రమాదంలో ప్రభుత్వ నిర్లక్ష్యం ఏమి లేదని ఆయన చెప్పారు.

**---------- బైట్ పొన్నం ప్రభాకర్ -------**

**DESK**

-------------------------------

**అగ్ని ప్రమాదం – మోదీ**

హైదరాబాద్ లో జరిగిన అగ్ని ప్రమాద ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ద్రిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన తమను తీవ్రంగా కలిచివేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు 2 లక్షల రూపాయ చొప్పుల ఎక్స్ గ్రేషియాను, గాయపడిన వారికి 50 వేల రూపాయల సహాయాన్ని ప్రధానమంత్రి ప్రకటించారు.

**NSD**

-----------------------------------

**One Nation - One Election:**

రాజకీయ సుస్థిరత కోసం, అభివృద్ధి కోసం ఒకే దేశం-ఒకే ఎన్నికల విధానం అమలులోకి రావాలని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. హైదరాబాద్ లో జరిగిన వన్ నేషన్ - వన్ ఎలక్షన్ అవగాహనా కార్యక్రమంలో కేంద్ర మంత్రి వర్చ్యువల్ గా ప్రసంగించారు. ఒకే సారి దేశ వ్యాప్తంగా ఎన్నికలు జరిపించే విధానాన్ని అమలులోకి తెచ్చేందుకు అవసరం అయిన రాజ్యాంగ సవరణ జరగాలని అభిప్రయపడ్డారు. ఇందుకోసం దేశ వ్యాప్తంగా మేధావులు ఆలోచించి కార్యాచరణకు పూనుకోవాలనీ అన్నారు. దేశంలో ప్రతి రోజు ఎక్కడో అక్కడ ఎన్నికలు జరగటం వల్ల ఎన్నికయిన నాయకులు ఎన్నికల తయారీలో నిమగ్నం అయి ఉంటారని అన్నారు. అధికారులు ఎన్నికల ఎర్పాట్లలో ఉండటంతో దేశంలో అభివృద్ధి కార్యక్రమాలు కుంటుపడతాయనీ మంత్రి పేర్కొన్నారు. అధికారులు ఉపాధ్యాయులూ, అంగన్ వాడీ కార్యకర్తలూ సహా అధికార యంత్రాంగం ఎన్నికల ఏర్పాట్లలో ఉందటం వల్ల అన్నీ రంగాల్లో పనులు నిలిచిపోతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి G కిషన్ రెడ్డి, BJP జాతీయ కార్యదర్శి సునీల్ బన్సాల్, పాల్గొన్నారు. పలు రంగాలకు చెందిన ప్రముఖులు, మేధావులూ హాజరయ్యారు.

**MSL**

----------------------------

**ఇందిరా సౌర జలవికాసం**

గిరిజన రైతుల పోడు భూములను సస్యశ్యామలం చేసేందుకు ఉద్దేశించిన ఇందిరా సౌర జలవికాసం పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రేపు ప్రారంభిస్తారు. ఈ పథకంలో భాగంగా రాష్ట్రంలో 12 వేల 600 కోట్ల రూపాయలతో రెండు లక్షల మందికి పైగా గిరిజన రైతులకు లబ్ధి చేకూరుస్తారు. ఈ పథకాన్ని అమలు చేయడానికి నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మాచారంలోని చెంచుల పోడు భూములను పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేశారు. నల్లమలలో ఉన్న మాచారం నుంచి ముఖ్యమంత్రి ఈ పథకాన్ని  లాంఛనంగా ప్రారంభిస్తారు. ఇందులో భాగంగా గ్రామంలోని 27 మంది చెంచులకు చెందిన 50 ఎకరాల పోడు భూములను గుర్తించారు. ఇద్దరు రైతులకు ఒక్కోటి చొప్పున బోరుబావులను ప్రభుత్వమే ఉచితంగా తవ్వించి, సోలార్ విద్యుత్ సౌకర్యం, 5 హెచ్‌పీ మోటార్లను ఏర్పాటు చేసింది. 186 బోర్లను తవ్వడం పూర్తైంది. ఆ భూములను చదును చేయడంతోపాటు ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో నిమ్మ, బత్తాయి, అవకాడో, మామిడి మొక్కలను నాటుతున్నారు. సరిహద్దుల చుట్టూ కొబ్బరి, వెదురు మొక్కలను ఏర్పాటు చేస్తున్నారు. అటవీ హక్కుల చట్టం ROFR కింద భూమి హక్కులు కలిగి ఉన్న గిరిజన రైతుల ఆర్థిక, జీవన ప్రమాణాలను  మెరుగుపరచడం ఈ పథకం ఉద్దేశం.

**(PTC/NGKR)**

----------------------------

**BREAK**

ఆకాశవాణి ప్రాంతీయ వార్తలు వింటున్నారు. మరిన్ని updates కోసం హైదరాబాద్ ప్రాంతీయ వార్తా విభాగం "ఎక్స్" handle @ air news_hyd ను ఫాలో అవండి. AIR News Hyderabad YouTube Channel ను సబ్ స్క్రైబ్ చేయండి.

--------------------

**ఇస్రో**

ఆంధ్రప్రదేశ్ లోని శ్రీహరికోట నుంచి ఈ రోజు చేపట్టిన పీఎస్ఎల్వీ - సి 61 రాకెట్ ప్రయోగం సాంకేతి సమస్య కారణంగా లక్ష్యాన్ని పూర్తి చేయలేకపోయిందని ఇస్రో ఛైర్మన్ నారాయణన్ తెలిపారు. ఈ రాకెట్ ద్వారా భూ పరిశీలనకు చెందిన ఈఓఎస్-09- రీశాట్-1బి- ఉపగ్రహాన్ని ప్రయోగించామని, కానీ మూడో దశ తర్వాత రాకెట్లో సమస్య వచ్చిందని ఆయన తెలిపారు. విశ్లేషణ తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని నారాయణన్ చెప్పారు.

**---------- BYTE NARAYANAN -----------**

**NSD**

---------------------

**జేఈఈ**

దేశంలోని 23 ప్రతిష్టాత్మక ఐఐటీల్లో ప్రవేశానికి నిర్వహించే జేఈఈ అడ్వాన్స్ డ్ పరీక్ష ఈ రోజు జరుగుతోంది. పేపర్-1 పరీక్ష ఇప్పటికే పూర్తికాగ పేపర్-2 పరీక్ష మధ్యాహ్నం 2 గంటల 30 నిమిషాల నుంచి 5 గంటల 30 నిమిషాల వరకు

జరుగుతుంది. అభ్యర్థులు గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదని అధికారులు తెలిపారు. తెలుగు రాష్ట్రాల నుంచి 40 వేల మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరవుతున్నారు.

**DESK**

-----------------------

**బడి బాట**

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాల కోసం జూన్ 6 నుంచి 19వ తేదీ వరకు ఆచార్య జయశంకర్ బడిబాట నిర్వహించాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఈ నెల 31 నాటికి పాఠశాలల మరమ్మతులు పూర్తి చేయాలని, జూన్ 6న స్థానిక ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులను భాగస్వామ్యం చేస్తూ పెద్ద ఎత్తున గ్రామసభ నిర్వహించాలని, ఏడవ తేదీన ఉపాధ్యాయులు ప్రతి ఇంటిని సందర్శించి బడీడు పిల్ల గుర్తించాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నరసింహారెడ్డి సూచించారు. విద్యా సంవత్సరం పునఃప్రారంభం కానున్న జూన్ 12న పాఠశాలలను అలంకరించాలని, పండగ వాతావరణంలో తల్లిదండ్రులకు, గ్రామస్థులకు స్వాగతం పలకాలని పేర్కొన్నారు.

**( DESK)**

-----------------------------

**ఆవుల అక్రమ రవాణా**

యాదాద్రి భువనగిరి జిల్లా పంతంగి టోల్ ప్లాజా వద్ద పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో 28 ఆవులను అక్రమంగా తరలిస్తున్న ముఠా పట్టుబడింది. ఆంధ్రప్రదేశ్లోని పిఠాపురం నుంచి హైదరాబాద్ కు గోవులను తరలిస్తున్న లారీని చౌటుప్పల్ పోలీసులు ఆపి తనిఖీ చేయగా, లారీ పై భాగంలో అరటి గెలలు ఉంచి, వాటి కింద దాచిన గోవులను కనుగొన్నారు. పోలీసులు ఆ వాహనాన్ని స్వాధీనం చేసుకుని, ఆవులను రక్షిత ప్రాంతానికి తరలించారు. డ్రైవర్, క్లీనర్ లను అదుపులోకి తీసుకున్నారు.

**(PTC/YDB)**

-----------------------------

**ఐఐటీహెచ్**

కొండాలక్ష్మణ్ బాపూజీఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాల జీ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, రాజన్న సిరిసిల్ల జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారులు తెలిపారు. మూడేళ్ల డిప్లొమా కోర్సుల్లో చేరేందుకు పదో తర గతి లేదా తత్సమాన పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారు జులై ఒకటో తేదీ నాటికి బీసీ, ఇతర సాధారణ వర్గాలకు 23 ఏళ్లు, ఎస్సీ, ఎస్టీలకు 25 ఏళ్లు ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. 2025-2026 విద్యా సంవత్సరానికి 60 సీట్లు ఉన్నాయని, ఎంపికైన అభ్యర్థులకు నేషనల్ హ్యాండ్లూమ్ డెవలప్మెంట్ కమిషన్ ద్వారా నెలకు రూ.5వేలు, తెలంగాణ చేనేత, జౌళిశాఖ ద్వారా మరో రూ.2500 ఉపకార వేతనం లభిస్తుందని తెలిపారు.

**(PTC/RS)**

-------------------------------

**మ్యూజియం**

ఈ రోజు అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవాన్ని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా ఉన్న అన్ని చారిత్రక ప్రదేశాలు, మ్యూజియాలలో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. దేశవ్యాప్తంగా అత్యంత విలువైన పురావస్తు కళాఖండాలు ఉన్న 52 మ్యూజియాల్లో ఈ రోజు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్లు కూడా అధికారులు పేర్కొన్నారు. హైదరాబాద్ లోని చార్మినార్, గోల్కొండకు కూడా నేడు సందర్శకులకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నారు.

**(DESK)**

---------------------------

**ఎండ్**

ఆకాశవాణి ప్రాంతీయ వార్తలు సమాప్తం. తిరిగి మధ్యాహ్నం 2 గంటల 55 నిమిషాలకు వార్తల ముఖ్యాంశాలు వింటారు.

--------------------------------